

గజ్వేల్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ ప్రచారానికి సిద్ధమైన రథాలు

# పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయి

- నేటి నుంచి బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం
- మూడోసారి కేసీఆరే సీఎం... ఇదే మా నినాదం
- ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 28 : సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలే బీఆర్ఎస్‌ను గెలిపిస్తాయని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్రంలో ఆగమైన ప్రజలకు తెలంగాణ ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించి పెట్టడంతోపాటు మరోసారి ఆగం కావొద్దన్న ఉద్దేశంతో అద్భుతమైన పథకాలు, ప్రాజెక్టులతో సీఎం కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి చేశారన్నారు. దశాబ్దాలుగా కాంగ్రెస్, బీజేపీ ఇతర పార్టీలు తెలంగాణ ప్రాంతాన్ని అభివృద్ధికి దూరంగా నెట్టివేశాయన్నారు. ప్రాణాలను తెగించి సాధించిన తెలంగాణను రెండుసార్లు సీఎంగా బాధ్యతలు చేపట్టి అద్భుతంగా తీర్చిదిద్దిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. నాడు నీటికోసం నోర్రెళ్లబెట్టిన చెరువులు కాళేశ్వరంతో కళకళలాడుతున్నాయని, కరువుతో కటకటలాడిన పొలాలు ఇప్పుడు బంగారు పంటలతో సస్యశ్యామలమయ్యాయని చెప్పారు. ఊరికి కిలోమీటర్ల దూరాన తాగునీరు తెచ్చుకున్న మహిళలకు ఇంటికే మిషన్ భగీరథతో తాగునీరు తెచ్చి పెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. సీఎం కేసీఆర్ అంటే రైతుబంధు, రైతుబీమా, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ కాళేశ్వరం ప్రాజెక్టు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, ఆసరా పింఛన్లు, దళితబంధు, బీసీబంధు, డబుల్‌బెడ్‌రూం, గృహలక్ష్మి పథకాలే ప్రజలకు గుర్తుకొస్తాయన్నారు. సంక్షేమ పథకాలతోపాటు గ్రామాల్లో పంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఆరోగ్య కేంద్రాలు, పల్లెప్రకృతి వనాలు, నర్సరీలు, వైకుంఠధామాలు, సకల వసతులతో పాఠశాలలు, వీధివీధినా సీసీరోడ్లు, మురుగు కాల్వలు, వాడవాడనా హరితహారం వృక్షాలు బీఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులే దర్శనమిస్తాయన్నారు. ఒకనాడు కూలిన ఇండ్లు, గుంతల రోడ్లతో కనిపించిన గ్రామాలు, పట్టణాలు.. ఇప్పుడు అభివృద్ధిలో దేశానికే ఆదర్శంగా నిలిచాయన్నారు. సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు.

**నేటి నుంచి ఇంటింటి ప్రచారం ప్రారంభం..**

గజ్వేల్ నియోజకవర్గవ్యాప్తంగా ఆదివారం నుంచి బీఆర్ఎస్ ఇంటింటి ప్రచారం ప్రారంభిస్తున్నట్లు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తెలిపారు. ప్రస్తుతం కొనసాగుతున్న సంక్షేమ పథకాలతోపాటు బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ప్రకటించిన కొత్త పథకాలను సైతం ప్రజలకు వివరిస్తూ గ్రామగ్రామాన బీఆర్ఎస్ ప్రచార రథాలు తిరుగుతాయన్నారు. ఆయా గ్రామాలు, పట్టణాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, బూత్ లెవల్ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహిస్తారని తెలిపారు. మూడోసారి కేసీఆరే మా సీఎం అనే నినాదంతో ప్రచారం కొనసాగిస్తామన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలతో ప్రజలకు, రైతులకు జరిగిన మేలు గురించి వివరిస్తామన్నారు. రాష్ట్రంలో మరోసారి అత్యధికంగా ఎమ్మెల్యే స్థానాలు గెలిసి సీఎం కేసీఆర్ నాయకత్వంలో ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.


# సీఎం కేసీఆర్‌తోనే రైతులు కోటీశ్వరులయ్యారు

**ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

గజ్వేల్ అర్బన్, అక్టోబర్ 28 : సీఎం కేసీఆర్ తెలంగాణ రాష్ట్రాన్ని అద్భుతంగా అభివృద్ధి చేయడంతోనే రైతులు కోటీశ్వరులయ్యారని ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి అన్నారు. శనివారం గజ్వేల్- ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీలోని ప్రజ్ఞాపూర్ గ్రామ రియల్ ఎస్టేట్ వ్యాపారులు సీఎం కేసీఆర్‌కు మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేశారు. అనంతరం ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని కలిసి తీర్మాన పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఎఫ్‌డీసీ చైర్మన్ మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంతోపాటు తెలంగాణను సీఎం కేసీఆర్ అభివృద్ధి చేయడంతో భూముల ధరలు కోట్ల రూపాయలు పలుకుతున్నాయన్నారు. లక్షలు కూడా దాటని భూముల ధరలు సీఎం కేసీఆర్ వల్ల పల్లెప్రాంతాల్లో కోట్ల రూపాయలు పలుకుతున్నాయన్నారు. తెలంగాణ మరింత అభివృద్ధి కావాలంటే సీఎం కేసీఆర్ మూడోసారి అధికారం చేపట్టాలన్నారు. కార్యక్రమంలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు పాల్గొన్నారు.

**కేసీఆర్ వెంటే ఆర్అండ్ఆర్ కాలనీవాసులు..**

గజ్వేల్‌అర్బన్, అక్టోబర్ 28 : సీఎం కేసీఆర్ వెంటే గజ్వేల్ ఆర్అండ్ఆర్ కాలనీవాసులు ఉన్నారని పల్లెపహాడ్ గ్రామ ప్రజాప్రతినిధులు అన్నారు. శనివారం తొగుట మాజీ జడ్పీటీసీ రాములు, పల్లెపహాడ్ ఉపసర్పంచ్ రజితానాగరాజు, నంద్యా నాయక్, మల్లేశం, నర్సింహులు, నర్సింహులు, నాయకులు ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డిని కలిసి సీఎంకేసీఆర్‌కే తమ మద్దతు ప్రకటించారు. త్వరలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించి ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని అందజేస్తామని తెలిపారు.



ఏకగ్రీవ తీర్మాన పత్రాన్ని ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డికి అందజేస్తున్న రియల్ వ్యాపారులు

# కాంగ్రెస్‌ను నమ్మితే 'కర్ణాటక' కష్టాలే..

- కాంగ్రెస్ గ్యారంటీలకు మోసపోవద్దు
- ఆ పార్టీని నమ్మితే మీకూ.. మాకు కష్టాలే
- నారాయణఖేడ్‌లో కర్ణాటక రైతుల ప్రచారం
- ర్యాలీని అడ్డుకునేందుకు కాంగ్రెస్ యత్నం



నారాయణఖేడ్ పట్టణంలోని రాజీవ్‌చౌక్ వద్ద ప్రదర్శన చేపట్టిన కర్ణాటక రైతులు

నారాయణఖేడ్, అక్టోబర్ 28 : కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలు తెలంగాణ ప్రజలు నమ్మి మోసపోవద్దు, ఇటీవల కర్ణాటకలో ఆపార్టీ హామీలను విశ్వసించి గెలిపిస్తే అధికారంలోకి వచ్చిన తర్వాత గాలికొదిలేశారు.. ఇది సాక్షాత్తు కర్ణాటకకు చెందిన రైతులు, మహిళలు చెప్పిన నిజం. నారాయణఖేడ్‌లో శనివారం కర్ణాటకకు చెందిన సుమారు 200మంది రైతులు, మహిళలు జనజాగృతి పేరిట భారీ ర్యాలీ నిర్వహించారు. మంగల్‌పేట్‌లోని భవానీ ఆలయం నుంచి రాజీవ్‌చౌక్ మీదుగా బసవేశ్వర చౌక్ వరకు కాంగ్రెస్ విస్మరిం చిన హామీల ప్లకార్డులు, ఫ్లెక్సీలను ప్రదర్శిస్తూ పాదయాత్ర చేపట్టారు. అనంతరం విలేకరుల సమావేశంలో బీదర్ జిల్లా రైతు సంఘం నాయకులు సంజీవ్‌కుమార్ టొళ్లే, దేవరాజ్‌గౌడ, పెనినగౌడ, సోమనాథ్ తదితరులు మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ ఇచ్చిన ఐదు హామీలు సక్రమంగా అమలుకు కావడం లేదన్నారు. 8 గంటల విద్యుత్ ఇస్తామని కేవలం రెండు గంటలు మాత్రమే ఇస్తున్నారని తెలిపారు. ప్రతి కుటుంబానికి నెలకు పది కిలోల బియ్యం ఇస్తామని, ఐదు కిలోలు ఇస్తుందని తెలిపారు. గృహలక్ష్మి పేరిట ప్రతి మహిళకు నెలకు రూ.2వేలు ఇస్తామని, ఇప్పుడు అనేక ఆంక్షలు పెట్టారన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి ఇంకా ప్రారంభించలేదన్నారు. కర్ణాటకలో తాము మోసపోయిన విధంగా తెలంగాణ ప్రజలు మోసపోవద్దనే ఉద్దేశంతోనే జనజాగృతి యాత్ర చేపట్టిందన్నారు.



కాంగ్రెస్‌కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శిస్తున్న కర్ణాటక మహిళలు

**రైతుల ర్యాలీపై కాంగ్రెస్ అక్కసు..**

కర్ణాటక రైతులు చేపట్టిన యాత్రపై కాంగ్రెస్ కార్యకర్తలు అక్కసు వెళ్లగక్కారు. మాజీ ఎమ్మెల్యే కిష్టారెడ్డి నివాసం వద్దకు ర్యాలీ చేరుకోగానే అక్కడ ఉన్న కాంగ్రెస్ కార్యకర్తలు ఒక్కసారిగా దూసుకొచ్చారు. రైతుల చేతిలోని ప్లకార్డులు, ఫ్లెక్సీలను లాక్కుని చించివేసి దౌర్జన్యం చేశారు. రాజీవ్‌చౌక్ వద్ద రైతు లపై దాడికి యత్నించగా, పోలీసులు అడ్డుకున్నారు. ఇదిలా ఉంటే తీవ్ర ఉద్రిక్తత మధ్య రైతుల ర్యాలీ బసవేశ్వర చౌక్ వరకు కొనసాగింది.

# కేసీఆర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటాం



మాట్లాడుతున్న మాజీ సర్పంచులు

గజ్వేల్, అక్టోబర్ 28 : ఎన్నికల్లో కేసీఆర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించుకుంటామని మండల మాజీ సర్పంచులు నాగిరెడ్డి, బాలమణి, రాంరెడ్డి, కొమురయ్య, నర్సింహులు, సత్యనారాయణ, అశోక్, శ్రీశైలం, మల్లికార్జున్, దుర్గారెడ్డి, రాములు, రాజాగౌడ్ అన్నారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటు చేసుకున్న సమావేశంలో వారు మాట్లాడుతూ తాము సర్పంచులుగా ఉన్న సమయంలో గ్రామాలాభివృద్ధికి అధిక నిధులు కేటాయించిన కేసీఆర్‌కు అత్యధిక మెజార్టీ వచ్చేలా కృషి చేస్తామన్నారు. కేసీఆర్‌తోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. కేసీఆర్‌కే ప్రజలు దీవించేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు.



మాట్లాడుతున్న నూనె కుమార్‌యాదవ్

# లక్ష ఓట్ల మెజార్టీయే లక్ష్యం

కొండపాక(కుకునూరుపల్లి), అక్టోబర్ 28 : గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్న సీఎం కేసీఆర్‌కు లక్ష ఓట్ల మెజార్టీయే లక్ష్యంగా ముందుకు వెళ్తామని బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు నూనె కుమార్‌యాదవ్ అన్నారు. శనివారం కొండపాక మండలం తిమ్మారెడ్డిపల్లి, రవీంద్రనగర్ గ్రామాల్లో బీఆర్ఎస్ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారీ మెజార్టీ లక్ష్యంగా ప్రతి 100 ఓట్లకు ఒకరిని ఇన్‌చార్జిగా నియమిస్తున్నామని తెలిపారు. గజ్వేల్ నియోజకవర్గంలో ప్రజలంతా సంతోషంగా ఉన్నారని, అభివృద్ధిలో గజ్వేల్‌ను ఆదర్శంగా తీర్చిదిద్దిన సీఎం కేసీఆర్‌ను లక్షకు పైగా ఓట్లతో గెలిపించేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలని కార్యకర్తలకు సూచించారు.

# హ్యాట్రిక్ సీఎం కావాలని పూజలు

గజ్వేల్‌అర్బన్, అక్టోబర్ 28 : లక్ష ఓట్ల మెజార్టీతో కేసీఆర్ మూడోసారి గెలిచి సీఎం కావాలని బీఆర్ఎస్ నాయకులు అరుణాచల గిరిప్రదక్షిణ చేశారు. తమిళనాడులోని అరుణాచలేశ్వరుడిని శనివారం బీఆర్ఎస్ నాయకులు దర్శించుకుని గిరిప్రదక్షిణ చేశారు. గజ్వేల్‌కు చెందిన ఆకుల రాజు, నంగునూరి విజయ్‌కుమార్, చకిలం సంపత్‌కుమార్, రిక్కల తిరుపతిరెడ్డి, బాలకృష్ణ అరుణాచలేశ్వరుడిని దర్శించుకుని మొక్కుకున్నారు.



అరుణాచల గిరిప్రదక్షిణ చేస్తున్న గజ్వేల్ నాయకులు

# అధికారంలో ఉన్నప్పుడు ఎందుకు గుర్తుకు రాలే..

గజ్వేల్, అక్టోబర్ 28 : తెలంగాణ ప్రభుత్వంలో మంత్రి పదవి అనుభవించినప్పుడు ఈటల రాజేందర్‌కు ముదిరాజ్‌లు ఎందుకు గుర్తుకు రాలేదని, ఎన్నికల సమయంలోనే ఎందుకు గుర్తుకు వస్తున్నారని ముదిరాజ్ సంఘం రాష్ట్ర నాయకులు కొట్టాల శ్రీనివాస్, గొడుగు స్వామి ప్రశ్నించారు. శనివారం గజ్వేల్‌లో స్థానిక విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ తన కుమారుడు, కుమార్తెకు రెడ్డి సామాజిక వర్గం నుంచి సంబంధాలు తెచ్చుకున్న ఈటల రాజేందర్ ముదిరాజ్ కులం పేరు ఎలా వాడుకుంటున్నాడో ప్రజలకు చెప్పాల్సిన అవసరం ఉందన్నారు. తన కుమారుడు, కుమార్తెలకు ముదిరాజ్‌లతో ఎందుకు సంబంధాలు తెచ్చుకోలేదన్నారు. స్వార్థ రాజకీయాల కోసమే కులాన్ని అడ్డం పెట్టుకొని నేడు ఎన్నికల్లో గెలవాలని చూస్తున్న ఈటలకు ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు, నాయకులు చింతా ప్రభాకర్, యూత్ మండల అధ్యక్షుడు అనిల్, పూరం గణేశ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కొట్టాల శ్రీనివాస్, గొడుగు స్వామి